క్లుప్తంగా

సచివాలయాల తనిఖీ


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

సింహాద్రిపురం : స్థానిక గ్రామ సచివాలయం -1, 2లను గురువారం ఎంపీడీఓ కృష్ణమూర్తి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బందితో అన్ని రకాల సర్వేల వివరాలను అడిగి తెలుసుకుని త్వరగా పూర్తి చేయాలని, లేకుంటే శాఖాపరమన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థినుల ప్రతిభ


మెమెంటో అందుకుంటున్న విద్యార్థిని

పులివెందుల రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు గంగా మోహిత, నందినిలు ఇంటర్ డిస్టిక్ యూత్ ప్రొగ్రాంలో మంచి ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 2వ తేదీనుంచి విశాఖపట్టణంలోని నెహ్రూ యువకేంద్రం నిర్వహించిన ప్రొగ్రాంలో పాల్గొని మంచి ప్రతిభ చూపారన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థినులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధీర, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ రాజీనామా చేయాలి

వల్లూరు (చెన్నూరు) : తిరుపతిలో భక్తుల తొక్కిసలాటలో ఆరుగురు మరణించడం బాధాకరమని కడప జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రసాని నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ టీటీడీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలనీ ఆయన డిమాండ్ చేసారు. అలాగే రానున్న రోజుల్లో మరింత అప్రమత్తంగా ఉంటూ.. వీఐపీ తాకిడి, సేవ తగ్గించి, సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు : తిరుపతి తొక్కిసలాటకు సంబంధించి సమగ్రమైన విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. గురువారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా టోకన్లజారీ చేస్తున్న అధికారులు భక్తులకు సరైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఒకేసారి గేట్లు తెరచి ఆరు మంది మృత్యువుకు కారణమయ్యారు. ప్రభుత్వం మాత్రం రూ. 25లక్షలు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తుందే తప్ప బాధిత కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం అప్పగించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండా గట్టి చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

జమ్మలమడుగు రూరల్ : నిరుద్యోగ యువతి యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి విజయ వినీల్‌కుమార్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్‌లు తెలిపారు. గురువారం నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో రెండు కంపెనీల ప్రతినిధులు వచ్చి విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం ఎంపికైన విద్యార్థులకు నియమాక పత్రాలను అందజేశారు.

గణిత అధ్యాపకుడికి డాక్టరేట్


వెంకటేశ్వర్

జమ్మలమడుగు : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకాలేజీ గణిత అధ్యాపకుడిగా పనిచేస్తున్న వెంకటేశ్వర్‌కు యోగివేమన యూనివర్శిటి డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. గురువారం స్థానిక డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటేశ్వర్ గణిత శాస్త్రంలో తిరిటికల్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్‌ది క్యారెక్టర్స్‌క్స్ ఆఫ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్‌ఆఫ్ వేరియస్ హైబ్రిడ్ నానోఫ్లుయిడ్ ఓవర్ ఏ స్ఫూర్ బై ఉసింగ్ స్టాటిస్టికల్ టూల్స్ అనేఅశంపై డాక్టర్ సునీత అసోషియేట్ ప్రొఫెసర్ పర్యవేక్షణలో రావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఇప్పపెంట మాజీ సర్పంచ్ సాహెబ్ పీర్ సోమవారం మరణించారు. ఈ విషయం వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజనేయరెడ్డికి తెలియడంతో ఆయన గురువారం బోడెద్దులపల్లెలోని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రబీ సాగులో పంటల దిగుబడులపై దిగులు

- నల్ల తెగులుతో దెబ్బతిన్న మినుము పంట
- వర్షాలతో ఏపుగా పెరిగిన శనగ
- దిగుబడులపై సన్నగిల్లిన ఆశలు
- ఆందోళనలో రైతులు


నల్ల తెగులుతో దెబ్బతిన్న మినుము పంట

వేముల : ఎన్నో ఆశలతో రబీలో సాగు చేసిన పంటల్లో దిగుబడులపై రైతులు దిగాలు చెందుతున్నారు. సకాలంలో వర్షాలు కురిసి భూములు పదున్లు అయ్యాయి. అదునులో విత్తన పడటంతో సాగులో దిగుబడులు బాగా ఉంటాయని ఆశించారు. అయితే రబీలో పంటలు సాగు చేశాక వాతావరణ పరిస్థితులు అనుకూలించక పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రబీలో ఈ ఏడాది మినుము పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగైంది. ఈ ఏడాది శనగ సాగు విస్తీర్ణం తగ్గింది. అదునులో పంటలు సాగైతే ఆశించిన మేర దిగుబడులు ఉంటాయని ఆశించామని, అయితే అనుకోని ఉపద్రవాలు రావడంతో పంటలు దెబ్బతిని నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

తెగుళ్లతో దెబ్బతిన్న మినుము

ఈ ఏడాది మినుము పంటపై రైతులు దృష్టి పెట్టి సాగు చేశారు. అక్టోబరు మొదటి వారంలో మినుము సాగు చేసుకున్నారు. సాగు అనంతరం మినుము పంట ఆశాజనకంగా ఉండటంతో రైతులు ముందు జాగ్రత్తగా మందులు స్ప్రే చేసి పంటను కాపాడుకున్నారు. పంట పూత దశలో ఉండగా తుపాన్ ప్రభావంతో వర్షాలు కురిశాయి. దీంతో పంటకు తెగుల్లు సోకాయి. పంటను కాపాడుకునేందుకు ఏడెనిమిది సార్లు మందులు పిచికారి చేశారు. ఇందుకోసం వేల రూపాయలు ఖర్చు చేశారు. రెండవ సారి తుపాన్‌తో వర్షాలు పడటంతో పంటకు నల్ల తెగులు సోకింది. దీంతో పంట దెబ్బతింది.

సాగులో తగ్గనున్న దిగుబడులు

తెగుళ్లు మినుము పంటపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. తుపాన్‌తో వర్షాలు కురిసి పూత, పిందె రాలిపోయింది. వర్షాలకు ముందు ఉన్న కాయలు కూడా పొక్కిపోవడంతో దిగుబడులు తగ్గిపోతున్నాయి. ఎకరాకు 2 క్వింటాళ్లకు మించి దిగుబడులు వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. సాగులో ఆశించిన మేర దిగుబడులు అందక పెట్టుబడులు కూడా అందలేదని రైతులు వాపోతున్నారు. ఎకరా మినుము సాగుకు రూ.20 వేలకుపైనే పెట్టుబడులు అయ్యాయని, సాగులో రెండు క్వింటాళ్ల దిగుబడులు రావడంతో రూ.14 వేలు వచ్చిందని, ఇలా అయితే వ్యవసాయం వదులుకోవాల్సి వస్తోందని రైతు అంటున్నారు.


వర్షాలతో ఏపుగా పెరిగిన శనగ పంట

వర్షాలతో ఏపుగా పెరిగిన శనగ

ఈ ఏడాది శనగ పంట ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చే పరిస్థితి లేదు. అక్టోబరు చివరి వారంలో శనగ పంటను సాగు చేసుకున్నారు. ఇప్పటికే పంట సాగు చేసి 80 రోజులు కావస్తోంది. మరో వారం, రెండు వారాల్లో పంటను పీకి వేయాల్సి ఉంది. అయితే శనగ సాగు చేశాక రెండు సార్లు తుపాన్లు రావడంతో శనగ పంటలో పూత, పిందెలు లేవు. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. పంట కాలం పూర్తి కావాలంటే మరో నెల రోజులు పట్టే అవకాశం ఉంది. సాగులో ఎకరాకు 2 క్వింటాళ్ల దిగుబడులు అందే అవకాశం లేదని రైతులు అంటున్నారు.

నాలుగు ఎకరాల్లో సాగు చేశా



నాకున్న నాలుగు ఎకరాలలో మినుము పంట సాగు చేశా. ఎకరాకు రూ.20 వేలకుపైనే పెట్టుబడులు పెట్టా. ఎకరాకు 2 క్వింటాళ్లు కూడా దిగుబడులు రాలేదు. తుపాన్‌తో వర్షాలు కురిసి పంట దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నాం.

– చంద్రమోహన్‌రెడ్డి, మినుము రైతు, గొందిపల్లె

శనగ సాగులో నష్టాలే



ఈ ఏడాది శనగ సాగులో నష్టపోతున్నాం. నాకున్న 8 ఎకరాలలో రబీలో శనగ సాగు చేశా. పంట పూత దశలో ఉండగా రెండు సార్లు తుపాన్‌తో వర్షాలు కురిశాయి. పంటలో పూత రాలిపోయింది. ప్రస్తుతం పంట పూతదశలో ఉంది. ఎకరాకు 3 క్వింటాళ్ల దిగుబడులు వచ్చే పరిస్థితి లేదు.

– అంకిరెడ్డి, శనగ రైతు, గొందిపల్లె

నేడు బండలాగుడు పోటీలు

పులివెందుల రూరల్ : ఉలిమెల్ల గ్రామంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి మహోత్సవం సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉలిమెల్ల గ్రామస్తులు ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు బండలాగుడు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఈ పోటీలలో మొదటి బహుమతి కింద మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.50వేలు, రెండవ బహుమతి కింద రూ.40వేలు చంద్రశేఖరరెడ్డి, వెంకట్రామిరెడ్డి, మూడవ బహుమతి కింద మునిగోపాల్‌రెడ్డి, సందీప్‌రెడ్డిలు రూ. 30వేలు, నాల్గవ బహుతుల కింద తొండూరు మండలం గోటూరుకు చెందిన బాల గంగిరెడ్డి, కొండ్రెడ్డిపల్లెకు చెందిన రమణయ్యలు రూ.20వేలు, 5వ బహుమతిని నరసింహారెడ్డి రూ.10వేలు, 5వ బహుమతి రాచమల్లు మహేశ్వర్‌రెడ్డి రూ.6వేలు నగదను అందజేయనున్నారు. సాయంత్రం 6 గంటలకు బూచుపల్లి సీతారామ కోలాట బృందంచే కోలాటం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

వీరపునాయునిపల్లె : మండలంలోని అలిదెన ఓబాయపల్లెలో శుక్రవారం ఉదయం జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని ఇంటి ముందర రోడ్డులో నీల్లు వస్తున్నాయన్న కారణంతో శంకరయ్య, ఈశ్వరయ్య ఇద్దరు ఘర్షణ పడ్డారని ఈ ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయన్నారు. వీరిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మంజునాథ్ తెలిపారు.

రూ.300 పడేలా మార్కింగ్ ఇవ్వాలి


మాట్లాడుతున్న పీడీ ఆదిశేషారెడ్డి

కమలాపురం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ప్రతి కూలీకి రూ.300 కూలీ డబ్బులు పడే విధంగా మార్కింగ్ ఇవ్వాలని ఆ పథకం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదిశేషారెడ్డి తెలిపారు. గురువారం కమలాపురంలోని ఉపాధి కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలోని ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీకి రూ.300 కూలీ డబ్బులు పడే విధంగా మార్కింగ్ ఇవ్వాలన్నారు. మేట్ల సాయంతో కనీసం 4 గంటల పాటు కూలీలు పని చేసేలా చూడాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. ప్రతి ఎఫ్ఏ రాబోయే 6 నెలల పాటు చేయవలసిన పనులు, పని దినముల టార్గెట్స్‌ను దృష్టిలో పెట్టుకుని కష్టపడి పని చేయాలన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న శ్రమ శక్తి సంఘాలు కూడా కూలీల ఇష్టం మేరకే చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఏపీఓ పార్థసారధి, రీసోర్స్ పర్సన్ నరసింహులు, కోర్స్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, టీఏలు శ్రీనువాసులు, సుబ్బారెడ్డి, సీఓ రామ లింగారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు


శ్రీచైతన్యలో హరిదాసు వేషధారణలో చిన్నారి


శ్రీనివాస పాఠశాలలో నృత్యం చేస్తున్న చిన్నారులు

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. ముందస్తు సంక్రాంతి పండుగలో భాగంగా పాఠశాల ఆవరణలో భోగి మంటలు వేసి సంబరాలు చేసుకున్నారు. విద్యార్థులు, చిన్నపిల్లలు వేసిన నృత్య ప్రదర్శనలు అందరిని అలరించాయి. ముగ్గులు పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి కరస్పాండెంట్ చేతులమీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే స్థానిక శ్రీనివాస ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ కేశవులు ఆధ్వర్యంలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి. ముందస్తు భోగి మంటలతో పాటు ప్రారంభమైన వేడుకలలో భాగంగా రంగు వల్లుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి.

కుప్పాలపల్లెలో లేగ దూడల మహోత్సవం


లేగ దూడల ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఉప సంచాలకులు డాక్టర్ మంగేశ్వరరావు

వేంపల్లె : సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని కుప్పాలపల్లెలో లేగ దూడల మహోత్సవాన్ని నిర్వహించారు. గురువారం కుప్పాలపల్లెలో రాష్ట్రీయ గోకుల్ మిషన్, ఏపీ పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ అధికారులు జాతీయ కృత్రిమ గర్భదారణ ద్వారా పుట్టిన లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ నేపథ్యంలో లేగ దూడల ప్రదర్శనను పులివెందుల ఉప సంచాలకులు డాక్టర్ మంగేశ్వరరావు ప్రారంభించారు. లేగ దూడల ప్రదర్శనలో 42 కృత్రిమ గర్భ దారణ ద్వారా పుట్టిన లేగ దూడలను రైతులు తీసుకొని వచ్చి ప్రదర్శనలో పెట్టారు. ప్రదర్శనలో పాల్గొన్న లేగ దూడలను పరిశీలించి ఆరోగ్యవంతంగా ఉండే లేగ దూడలను ఎంపిక చేసి వాటి యాజమానులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పులివెందుల ఉప సంచాలకులు పశువులను కొనుగోలు చేసేటప్పుడు మంచి మేలు రకం పశువులను కొనుగోలు చేయాలన్నారు. కడప డీఎల్‌డీఏ డాక్టర్ శివరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.1350 ధర నిర్ణయించి లింగ నిర్ధారిత వీర్యం ప్రవేశ పెట్టిందని, సబ్సిడీ కింద రూ.850 జమ అవుతుందని, అయితే రైతు రూ.500 చెల్లిస్తే లింగ నిర్ధారిత వీర్యం అందిస్తుందన్నారు. అనంతరం పశువులలో వచ్చే గర్భకోశ వ్యాధులు, దూడల పెంపకం లింగనిర్ధారణ వీర్యం వలన వచ్చే లాభాలను వివరించారు. కార్యక్రమంలో వేంపల్లె పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ సాదిక్ బాషా, డాక్టర్ బొజ్జా ఓబుల్‌రెడ్డి, ఏహెచ్ఏ వనజ, పశువర్ధక శాఖ సిబ్బంది, రైతులు, పాల్గొనారు.

ప్రతి రైతుతో ఈకేవైసీ నమోదు చేయించాలి

లింగాల : రబీలో పంట నమోదు చేసుకున్న ప్రతి రైతుతో ఈకేవైసీ నమోదు చేయించాలని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. గురువారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఏఓ రమేష్ అన్ని రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పంట నమోదు జాబితాను రైతు సేవా కేంద్రం వారీగా సోషల్ ఆడిట్ నిర్వహించాలని, పంట నమోదు జాబితాలో ఎటువంటి తప్పిదాలు చేసిన సంబంధిత సిబ్బందిపైన చేర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఇ-పంట నమోదు తప్పక చేసుకోవాలి

కమలాపురం : జిల్లాలోని రైతులందరూ తప్పని సరిగా ఇ-పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. గురువారం మండలంలోని దేవరాజుపల్లె, కమలాపురం రైతు సేవా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, లైబ్రరీని, సోషల్ ఆడిట్, క్రాప్ ఇన్సూరెన్స్ రిజిష్టర్, ఇ-పంట, ఎరువుల స్టాక్ తదితర వాటిని పరిశీలించారు. రైతులకు ప్రతి దశలో అందుబాటులో ఉండి వారికి అవసరమైన సేవలు అందించాలన్నారు. రైతులతో ఇ-పంట నమోదు, ఇ-కేవైసీ నమోదు చేయించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం దేవరాజుపల్లె వద్ద వేరుశనగ పంట నూర్పిళ్లను పరిశీలించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వేంపల్లె : మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. గురువారం చక్రాయపేట మండలంలోని ఎన్ఎస్ఎస్ యూనిట్-11 దత్తత గ్రామమైన ఆధ్వర్యంలో కొండవాండ్లపల్లె గ్రామంలో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కొండవాండ్లపల్లె గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఇళ్లతోపాటు చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ ప్రజలకు తెలియజేశారు. అనంతరం స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రామంలోని మురికి కాలువలను వీధులను శుభ్రం చేశారు. అలాగే ప్రాథమిక పాఠశాల, డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడ చదువుతున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలో వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోవర్ధన్, పరిపాలన అధికారి రవికుమార్, కోఆర్డినేటర్ దీప్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్తను వేరు చేయు మిషన్ పరిశీలన


మిషన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాముడు

పులివెందుల టౌన్ : పట్టణంలోని కదిరి రోడ్డులో ఉన్న కంపోస్ట్ యార్డులో గురువారం నూతనంగా ఏర్పాటు చేస్తున్న చెత్తను వేరు చేయు మిషన్‌ను మున్సిపల్ కమిషనర్ రాముడు పరిశీలించారు. ఈ సందర్భంగా మిషన్‌లో ఎటువంటి సాంకేతిక సమస్యలు రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ముక్కోటి ఏకాదశి వేడుకలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ చింతకుంట సుధీకర్‌రెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామునుంచి స్వామి వారి దర్శనం కొనసాగుతుందన్నారు. భక్తుల సహకారంతో మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న తీర్థప్రసాదాలను ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం గరుడ వాహనంపై స్వామివారు పులివెందుల పురవీధులలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. అలాగే 13వ తేదీన ఆలయంలో శ్రీగోదామాత శ్రీరంగనాథ స్వాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారన్నారు. సమావేశంలో ఈవో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు సిద్ధం


వైకుంఠ ఏకాదశికి ఎర్పాటు చేసిన బారికేడ్లు

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన శ్రీ మోక్ష నారాయణస్వామి ఆలయంలో శుక్రవారం ఉత్తర ద్వార దర్శనం నిర్వహించేందుకు పుణ్యభూమి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. తెల్లవారు జామున నుంచే భక్తులు స్వాముల వారిని ఉత్తర ద్వారం గుండా దర్శనం చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి శుక్రవారం మోక్షనారాయణ స్వామి ఆలయానికి హాజరు కానున్నారన్నారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట: స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకా దశి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వార ప్రవేశంకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ మోపూరి రామాంజనేయరెడ్డి, మాజీ చైర్మన్‌లు తెలిపారు. భక్తులకు ఉదయం 5గంటల నుంచే స్వామి దర్శనం కల్పించారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని రుటూరు గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ఉమామహేశ్వర శర్మ తెలిపారు. శుక్రవా రం ఉదయం 2.30 గంటలకు భక్తులకు వైకుంట ద్వార దర్శనము జరుగుతందని తెలియజేశారు. మద్యాహ్నం 2 గంటలకు దండుపల్లె గ్రామానికి చెందిన రామాంజనేయ బృందం వారిచే కోలాటం ఉంటుందన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలోని తిరుమల తిరుపతి నారాపురస్వామి వేంకటేశ్వర ఆలయంలో వైకుంఠ ఏకాదశి కోసం భారీగా ఎర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ అధికారులు బారికేడ్లతోపాటు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. ఆలయంలో చలువ పందిర్లను ఏర్పాటు చేశారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

తొండూరు : స్థానిక పీహెచ్‌సీలో గురువారం డాక్టర్ రేష్మా ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులకు ప్రత్యేక గర్భస్థ పరీక్షలు, హిమోగ్లోబిన్, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. రక్తం తక్కువ ఉన్న వారికి ఐరన్, సుక్రోజ్ ఇంజెక్షన్లు వేశారు. అలాగే స్కాన్కింగ్‌ల కొరకు ఉన్నత ఆసుపత్రులకు పంపించారు. అనంతరం ఆమె రక్తహీనత, ఆసుపత్రి ప్రసవాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ అరిఫుల్లా, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి విజయ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, వైద్య సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవస్థాన భూమి, నిధులు అన్యాక్రాంతం?


గంగమ్మ దేవస్థానం నిధులు విషయమై వేలం వద్ద ప్రశ్నిస్తున్న భక్తుడు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మ దేవస్థానంకు సంబంధించిన భూమి, నిధులు అన్యాక్రాంతమవుతున్నట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. గురువారం దేవస్థాన పరిధిలో మూడవసారి తలనీలాల హక్కును, టెంకాయలు విక్రయించే హక్కుకు అధికారులు వేలం వేయగా తలనీలాల హక్కు కోసం మాత్రమే రూ. 2,15000 వెంకటరమణ వేలంపాటలో దక్కించుకున్నారు. టెంకాయల విక్రయ హక్కు వేలం మూడోసారి కూడా వేలంలో అధిక రిజర్వు ధర నిర్ణయించడం, దేవస్థానం పరిధిని సరిగ్గా నిర్ణయించకపోవడం కారణంగా ఆగిపోయి మరోసారి వాయిదా వేశారు. ఈ సందర్భంగా దేవస్థానం భూములు, నిధుల విషయంలో వస్తున్న ఆరోపణలపై వివరణ కోరగా.. ఈవో రవిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గంగమ్మ దేవస్థానానికి సంబంధించి చింతకొమ్మదిన్నె గ్రామ పొలం సర్వే నెంబర్లు 1257/1లో 12.60 ఎకరాలు, 1249లో 0.47 ఎకరాలు భూమికి గతంలో రెవెన్యూ అధికారులు మన్యూవల్ పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేశారని, మాన్యువల్ రికార్డులలో గంగమ్మ దేవతా భూమిగా నమోదు చేసి ఉన్నారని, 22ఎ లిస్టులో కూడా దేవస్థాన భూమిగా నమోదయి ఉన్నప్పటికీ కొంతమంది రిజిస్ట్రేషన్ సిబ్బంది సహకారంతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. కొందరు రెవెన్యూ రికార్డులో ఆన్‌లైన్లో నమోదు చేయించుకుంటున్నారని, ప్రస్తుత ఆన్‌లైన్ రికార్డులలో వేరుగా ఉందని, మిగతా ప్రభుత్వ శాఖల అధికారులు కూడా సహకరించవలసి ఉందన్నారు. త్వరలో కలెక్టర్ దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్తామని, నిధులు విషయంగా గంగమ్మ దేవస్థానం సంబంధించి రూ.80 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా నిధులు ఉన్నాయని తెలిపారు. దేవస్థానం భూమిలో దాతలు సుమారు పది రూములు నిర్మించి ఇచ్చినప్పటికీ రికార్డులు సరిగ్గా లేవనే కారణంగా బాడుగలు రాబట్టుకొనుటకు వేలం వేయకపోవడంపైన, లక్షలాది రూపాయల వసూలు అవకాశాన్ని వినియోగించకపోవడంతో భక్తుల నుండి తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను కూల్చేశారు

- అంబవరం జగనన్న కాలనీ వాసుల మొర


ఇళ్లను కూల్చి సదును చేసిన దృశ్యం


జగనన్న కాలనీలో రహదారికి చదును చేస్తున్న..

జమ్మలమడుగు : 67వ జాతీయ రహదారి నిర్మాణం కోసం అధికారులు భూసేకరణను పూర్తి చేశారు. అయితే పెన్నానది దక్షిణ వైపు ఉన్న అంబవరం సమీపంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇంట్లులేని నిరుపేదలకు ఇంటిస్థలంతోపాటు ఇళ్లను మంజూరు చేశారు. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. ప్రస్తుతం జాతీయ రహదారి నిర్మాణం కోసం భూసేకరణ చేస్తున్న నేషనల్‌హైవే అధికారులు కట్టుకున్న ఇళ్లను నోటీసులతోపాటు పరిహారం ఇవ్వకుండా కూల్చివేశారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంబవరం లేఅవుట్-1 మధ్యలో నుంచి జాతీయ రహదారి పోతుంది. మొత్తం 38 ఇళ్ల నిర్మాణాలను పడగొట్టారని జగనన్న కాలనీ బాధితులు వాపోతున్నారు.

67 జాతీయ రహదారి నిర్మాణం కోసం నంద్యాల జిల్లా సంజామల మండలం నొస్సం గ్రామం వరకు పూర్తి చేశారు. పెద్దముడియం మండలంలోని నాగిరెడ్డిపల్లె, గుల్లకుంట గ్రామాలు, జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు, మోరగుడి, జమ్మలమడుగు, కన్నెలూరు ప్రాంతాలకు చెందిన రైతుల భూములలో జాతీయ రహదారి కోసం రైతులు భూములను కోల్పోయారు. జమ్మలమడుగు మండలంలోని 174 మంది రైతుల భూముల్లో ఈ రహదారిపోతుందన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎస్.ఉప్పలపాడు గ్రామ రైతులకు రూ.12.51 లక్షలు, మోరగుడి రైతులకు రూ.16 లక్షలు, జమ్మలమడుగు కన్నెలూరు రైతులకు ఎకరాకు రూ.24 లక్షలు పరిహారం ఇవ్వడంకోసం ప్రభుత్వం నిర్ణయించింది. నంద్యాల జిల్లాలో మొత్తం 62 కిలోమీటర్ల నిర్మాణానికి రూ.850 కోట్లు కేటాయించింది. పెద్దముడియం మండలం పాపాయపల్లె నుంచి జమ్మలమడుగు మండలంలోని వేమగుంటపల్లి వరకు మొత్తం 22 కిలోమీటర్ల దూరం నిర్మాణం కోసం రూ.198 కోట్లు కేటాయించింది.

నోటీసులు ఇవ్వకుండానే పడగొట్టారు..

అంబవరం సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో తమ ఇంటి నంబర్ 828. రోడ్డు కోసం మేము కట్టుకున్న ఇంటిని మాకు తెలియకుండా, నోటీసులు, ఎటువంటి పరిహారం ఇవ్వకుండా పడగొట్టేశారు. అసలు విషయమే మాకు తెలపలేదు.

– నక్కా లక్ష్మీదేవి, జమ్మలమడుగు.



36 మందికి పరిహారం పండగ తర్వాత అందిస్తాం

జగనన్న కాలనీలలో పరిహారం కింద రూ.4 కోట్లు అవసరం ఉంది. అయితే ఇప్పటికే రూ.2 కోట్ల మేర పరిహారం ఇవ్వడం జరిగింది. అయితే చాలా మంది అడ్రసులు, బ్యాంక్ అకౌంట్‌లు తెలియకపోవడంతో రెవెన్యూశాఖ అధికారులతో కలిసి వారి అడ్రస్సులు, బ్యాంక్ అకౌంట్లు తీసుకున్నాం. సంక్రాంతి పండుగ తర్వాత రూ.2 కోట్లు పరిహారం మిగిలిన వారికి అందిస్తాం.

– సురేంద్రారెడ్డి, జాతీయ రహదారి ఏఈ